క్లుప్తంగా

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం



శివమారుతిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కోరుట్ల రూరల్: సివిల్స్‌లో ర్యాంకు సాధించిన అయిలాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు శివ మారుతి రెడ్డిని మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుంతం రాజం, జమాతే ఇస్లామీ ఆధ్వర్యంలో నాయకులు వేర్వేరుగా సన్మానించారు.ఈ సందర్భంగా రాజం మాట్లాడుతూ శివమారుతి రెడ్డి సివిల్స్‌లో ర్యాంకు సాధించటం అయిలాపూర్ గ్రామానికే గర్వ కారణమన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎలేటి పుల్లారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పన్నాల అంజిరెడ్డి, విష్ణు, అంజయ్య, ముత్తయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ భారతి

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, జెడ్పీ చైర్మన్ దావ వసంత సహకారంతో గ్రామాలు అభివృద్ధి చేస్తానని జెడ్పీటీసీ భారతి అన్నారు. మండలంలోని డబ్బా గ్రామంలో రూ. 6 లక్షల నిధులతో నిర్మించనున్న పుప్పాల సంఘ భవనం, డ్రెయినేజీ నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాలకు అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులు మంజూరు చేయిస్తానని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగంపెల్లి గంగాధర్, ఉపసర్పంచు కొటి దేవ రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ అశోక్ నాయకులు కమటం రమేష్, పుప్పాల నర్సయ్య, రాజేందర్, భూమేశ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

జగిత్యాలరూరల్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రూరల్ తహసీల్దార్ నవీన్ అన్నారు. మంగళవారం పొలాసలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించడంతో పాటు, తూకం వేసిన ధాన్యాన్ని తరలించేందుకు ప్రత్యేక లారీలను తెప్పించారు. కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేస్తున్నామని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రణీత్, వీఆర్ఏ మహేశ్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

రాయికల్: పట్టణంలో రాబోయే వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. మంగళవారం రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మోర హన్మండ్లు అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. పలు వార్డుల్లో సమస్యలపై కౌన్సిలర్లు ప్రశ్నించగా పరిష్కరిస్తామని కమిషనర్ సంతోష్‌కుమార్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో 23 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమాదేవి, కమిషనర్ సంతోష్‌కుమార్, కౌన్సిలర్లు మహేందర్, సాయికుమార్, శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, అన్వరిబేగం, కాంతారావు, అనురాధ, మేనేజర్ వెంకట్, ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

'గురుకులం'లో నలుగురు విద్యార్థులకు సీట్లు

సారంగాపూర్: మండలంలోని భీమ్యానాయక్ తండా ప్రాథమిక పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులకు 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించారు. పాఠశాలకు చెందిన అజ్మీరా విష్ణువర్ధన్, తాట్ర హర్షవర్ధన్, దండుగుల ధనుష్, అజ్మీరా సాత్వికలకు గురుకుల ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షల్లో అర్హత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయురాలు హేమలత, ఎంఈవో భీమయ్య విద్యార్థులను అభినందించారు.

సెలవులో వైద్యురాలు

రాయికల్: పట్టణంలోని వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యురాలు ఒడ్నాల రజిత 15 రోజుల పాటు సెలవుపై వెళ్లినట్లు సూపరింటెండెంట్ రవి మంగళవారం తెలిపారు. ప్రసవం కోసం వచ్చే గర్భిణులు జగిత్యాలకు వెళ్లాలని కోరారు.

అందుబాటులో ఉండి సేవలందించాలి

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు

మెట్‌పల్లి: ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సూచించారు. పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో మంగళవారం చైర్‌పర్సన్ రాణవేని సుజాత అధ్యక్షతన పాలకవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశముంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని పారిశుధ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు 14వార్డు కౌన్సిలర్ మర్రి పోచయ్య పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు. వర్షాకాలంలో 18 వార్డులోని పలు కాలనీలు జలమయమవుతాయని, దీని నివారణకు కోసం చేపట్టిన డ్రెయినేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని కౌన్సిలర్ చెట్లపల్లి మీనా విజ్ఞప్తి చేశారు. 13 వార్డు లోని బాలకృష్ణనగర్‌లో రోడ్లు, డ్రెయినేజీల సమస్యలను పరిష్కరించాలని కౌన్సిలర్ బాల్క ముత్తమ్మ కోరారు. కాగా సమావేశంలో మొత్తం 19 అంశాలను ప్రవేశపెట్టగా, వాటికి కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సాదా సీదాగా మున్సిపల్ సమావేశం

కోరుట్ల: మున్సిపల్ సమావేశం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అన్నం లావణ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ముఖ్య అతిథిగా హాజరు కాగా కౌన్సిల్ సభ్యులు పట్టణంలో నిర్వహించే 22 అభివృద్ధి అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తూ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేసి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, మున్సిపల్ కమిషనర్ ఎండీ.అయాజ్, డీఈఈ అభినయ్, ఏఈ లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమచేయాలి



ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న నాయకులు

మెట్‌పల్లి: ధాన్యం కొనుగోలు డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని వేంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సందర్శించి మాట్లాడారు. కొనుగోలు చేసిన 48 గంటల్లో చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం.. 15 రోజులు గడిచినప్పటికీ రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం లేదన్నారు. ధాన్యం కొనుగోళ్లలో కోతలు పెడుతున్న నిర్వాహకులు, మిల్లర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గోరుమంతుల ప్రవీణ్, సురేందర్‌రెడ్డి, లింగారెడ్డి ఉన్నారు.

వేంపేట, చింతలపేట గ్రామాల్లోని కేంద్రాలను రైతు ఐక్యవేదిక నాయకులు పరిశీలించి ఎలాంటి అంక్షలు లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి, గురిజెల రాజిరెడ్డి, శంకర్‌రెడ్డి, రాజిరెడ్డి ఉన్నారు.

దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



సీఐకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి: మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు తనయుడు జువ్వాడి నర్సింగరావుపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు మంగళవారం సీఐ లక్ష్మీనారాయణను కలిసి ఫిర్యాదు చేశారు. ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ వద్ద నర్సింగరావు దిష్టిబొమ్మను దహనం చేసి ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని సీఐకి వివరించారు. నర్సింగరావు ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బెజ్జారపు శ్రీనివాస్, కామిరెడ్డి లింగారెడ్డి, అబ్దుల్ హఫీజ్, అందె మారుతి తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నంలో ఎస్సైకి ఫిర్యాదు..

ఇబ్రహీంపట్నం : కాంగ్రెస్ పార్టీ కొరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుపై అనుచిత వ్యాఖ్యలు చేసి ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ వద్ద ఆయన దిష్టిబొమ్మ దహనం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎస్సై ఉమసాగర్‌కు మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు బెజ్జరపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్: కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు దిష్టిబొమ్మను దహనం చేసి అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అక్రమంగా మొరం తరలిస్తున్న జేసీబీల పట్టివేత

గొల్లపల్లి: మండల కేంద్రంలోని రామాలయం గుట్ట వెనుకాల అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు జేసీబీలను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా ప్రైవేట్ అవసరాలకు యథేచ్ఛగా మొరం తరలిస్తుండడంతో సమాచారం అందుకున్న ఆర్ఐ రాణి గుట్ట వద్దకు వెళ్లి రెండు జేసీబీలను పట్టుకున్నారు. అధికారులు రావడంతో కొందరు ట్రాక్టర్లతో పారిపోయారు. జేసీబీలను స్వాధీనం చేసుకుని, యజమానులు నల్ల చిన్న వెంకట్‌రెడ్డి, కొత్త తిరుపతిపై కేసు నమోదు చేసి, జేసీబీలను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మధు తెలిపారు.

విద్యార్థులకు సన్మానం

వెల్గటూర్: ఈ నెల 25 నుంచి 26 వరకు ఖమ్మం లో జరిగిన సీనియర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన క్రీడాకారిణులు బంగారు పథకాలు సాధించారు. సబ్బు మనూష రన్నింగ్‌లో బంగారు, వెండి పతకాలు, సబ్బు వసంత వాకింగ్ రేస్‌లో ప్రథమ స్థానం, అదే విధంగా సీఎం. కప్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న జి మేఘన రెండు ద్వితీయ స్థానం, ఒకటి తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పథకాలు సాధించిన విద్యార్థులను సర్పంచ్ మారం జలంధర్ రెడ్డి మంగళవారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కోచ్ బైకని కొమురయ్య, సీనియర్ క్రీడాకారులు మారపల్లి కృష్ణారెడ్డి, ఎం శ్రీనివాస్‌రెడ్డి, కోచ్ శివమణి, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

జగిత్యాల: ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్ అన్నారు. మంగళవారం పలు కార్యాలయాల్లో టీఎన్జీవో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పీఆర్సీ సాధారణ బదిలీలు, సీపీఎస్ రద్దు వంటి అంశాలపై ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో నాయకులు మామిడి రమేష్, విజయ్‌కుమార్, శ్రీనివాస్, షాహీద్‌బాబా పాల్గొన్నారు.

భూములు కాపాడాలని దళితుల వినతి

కోరుట్ల: మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ శివారులో ప్రభుత్వం తమకు ఇచ్చిన భూములను ఆక్రమణకు గురికాకుండా చూడాలని దళితులు మంగళవారం ఆర్డీవో వినోద్ కుమార్, ఎస్సై సతీష్ కుమార్‌లకు వినతి పత్రాలు సమర్పించారు. ప్రభుత్వం 30 ఏళ్ల క్రితం గ్రామంలో ఉన్న 400 దళిత కుటుంబాలకు సర్వే నెంబర్లు 444/2/1, 445/2/5 లో భూములు ఇచ్చారని ఆ భూముల్లో సీపీఐ నాయకులు ఎర్ర జెండాలు పాతి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. భూములను ఆక్రమణకు గురికాకుండా చూసి తమకు న్యాయం చేయాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం, దళిత సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'రెండు నెలలైనా కొనుగోళ్లు పూర్తి చేయలే'

సారంగాపూర్: ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ కొనుగోళ్లు పూర్తి చేయలేదని, ఇంకా కేంద్రాల్లో 40 శాతం ధాన్యం నిలువ ఉందని బీజేపీ రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నాగునూర్, లచ్చక్కపేట గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కేంద్రాల్లో తూకం వేసి నిల్వ ఉన్న సంచులను పరిశీలించారు. రోహిణీ కార్తె ప్రారంభమైనా కొనుగోళ్లు పూర్తి కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. రైతులకు పంట నష్ట పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు ఎండబెట్ల వరుణ్‌కుమార్, నాయకులు దీటి వెంకటేశ్, దామెర జలేందర్ తదితరులు ఉన్నారు.

యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడిగా కొండయ్య యాదవ్

జగిత్యాలటౌన్: యాదవ హక్కుల పోరాట సమితి యువజన విభాగం(వైహెచ్‌పీఎస్)జిల్లా ఉపాధ్యక్షుడిగా బత్తుల కొండయ్యయాదవ్‌ను నియమించినట్లు యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొక్కెరె మల్లేశ్ యాదవ్ మంగళవారం తెలిపారు. యాదవ హక్కుల సాధనకు తన వంతు కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన యాదవ సంఘం నాయకులకు కొండయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొక్కు దేవేందర్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు బల్కం మల్లేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ

జగిత్యాల: వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు మంత్రి కొప్పుల ఈశ్వర్ కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంక్షేమాధికారి నరేశ్ మాట్లాడుతూ, వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, దివ్యాంగులు కృత్రిమ అవయవాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు అదర్‌సింగ్, స్వప్నిమయ పాల్గొన్నారు.

మంత్రి 'ఎర్రబెల్లి'ని కలిసిన నాయకులు



మంత్రితో నాయకులు

కథలాపూర్: రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కథలాపూర్ మండలానికి చెందిన మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జెడ్పీటీసీ నాగం భూమయ్య మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధుల మంజూరు కోసం చర్చించినట్లు వారు పేర్కొన్నారు. నిధులు త్వరగా మంజూరు చేసేందుకు కృషి చేయాలని కోరినట్లు తెలిపారు.

రైతు వేదిక ప్రారంభం



రైతు వేదిక ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

కొండగట్టు: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారని చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ అన్నారు. కొడిమ్యాల మండలం నల్లగొండలో మంగళవారం రైతు వేదిక ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పల్లెల అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఒకప్పుడు ఎకరం భూమి రూ. 40 వేలు ఉండగా, సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో రూ.40 లక్షలు అయిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేనేని స్వర్ణలత, సర్పంచ్ ఏలేటి మమత, నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు

విశ్వకర్మ సంఘ భవనానికి స్థలం కేటాయింపు

జగిత్యాల: ధరూర్ క్యాంప్‌లోని ఎస్సారెస్పీ స్థలంలో 10 గుంటల భూమిని విశ్వకర్మ సంఘ భవనానికి స్థలం కేటాయించడంపై ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను సన్మానించారు. చల్‌గల్ బైపాస్‌రోడ్‌లోని విశ్వబ్రాహ్మణ సంఘానికి సంబంధించిన 40 గుంటల స్థలం జాతీయ రహదారికి పోయినందునా సంఘ భవనానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేను కోరగా, ఎస్సారెస్పీ స్థలంలో 10 గుంటల భూమిని కేటాయించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటరమణ, నిరంజనచారి, గంగారాం, నరహరి, మారుతి, భూమయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు చిత్రపటం బహూకరణ



కోరుట్ల: పట్టణానికి చెందిన అల్లె హర్షిత అనే విద్యార్థిని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు చిత్ర పటాన్ని గీసి మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనకు బహూకరించారు. హర్షితను ఎమ్మెల్యే సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాకారులకు ఎల్లప్పుడూ తన ప్రోత్సాహం ఉంటుందన్నారు. హర్షిత ముస్ముందు మంచి చిత్రాలు గీసి గొప్ప ఆర్టిస్టుగా జాతీయ,అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అనిల్, రాజేశ్, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు చీటి వెంకట్రావు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



సారంగాపూర్: మండలంలోని నాగునూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో మొదటి రోజు ఆరాధన, పుణ్యాహవచనం, రక్షా బంధనం, మృత్సంగ్రహనం,అంకురార్పణ, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ తదితర పూజలు నిర్వహించారు. సర్పంచ్ దమ్మ గంగు, గ్రామస్తులు, అర్చకులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ చిట్టిబాబు

ధర్మపురి: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడం కోసం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. అధికారులు, ప్రజాప్రతినిధులు సమయ పాలన పాటించకపోవడంతో మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా నిర్వహించారనే ఆరోపణలున్నాయి. ధర్మపురి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ చిట్టిబాబు అధ్యక్షతను మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఉదయం 10.30 ప్రారంభించాల్సిన సమావేశాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సమయానికి రాకపోవడంతో మధ్యాహ్నం 1 గం.లకు ప్రారంభించారు.

చదివి వినిపించిన ఎజెండా అంశాలు

మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత పట్టుమని పదిమంది కూడా హాజరు కాకపోవడంతో అధికారులు ఎజెండా అంశాలను చదివి వినిపించి తూతూ మంత్రంగా ముగించారు. సమయ పాలనా పాటించని వారిని అడిగే వారు కరువయ్యారు. సమస్యల పరిష్కారం కోసం అందరు కృషి చేయాలని ఎంపీపీ చిట్టిబాబు సూచించారు. గ్రామాల అభివృద్ధి కోసం చేపట్టిన పనులకు లక్షలాది రూ.లు పెట్టుబడులు పెట్టినప్పటికీ నిదులు మంజూరు కాకపోవడంపై సర్పంచులు, ఎంపీటీసీలు సమావేశానికి రాకుండా అసంతృప్తిని వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, అధికారులు, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

లారీల కోసం రైతుల పడిగాపులు



మానాలలో తూకం వేసి తరలించని ధాన్యం బస్తాలు

మల్యాల: ఆరుగాలం పండించిన ధాన్యం అమ్ముకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. అకాల వర్షాలతో తడిసిన, అదనపు తూకానికి ఒప్పుకుని తూకం వేయించినా, ధాన్యం బస్తాలు తీసుకెళ్లేందుకు లారీలు రాకపోవడంతో సుమారు ఆరువేల ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రంలో మూలుగుతున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారు లేక రైతులు లారీల కోసం పడిగాపులు కాస్తున్నారు. నిత్యం కొనుగోలు కేంద్రానికి వెళ్లి, ధాన్యం బస్తాలపై కవర్లు కప్పి, లారీలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితిలో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన సుమారు ఆరువేల ధాన్యం బస్తాలు నిల్వ ఉన్నాయని, రైస్‌మిల్లర్లను కట్టడి చేసేవారు లేకపోవడంతో లారీలు రావడం లేదని, తమ దీనస్థితిని జిల్లా అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని రైతులు తెలిపారు. మండలంలోని మానాల ధాన్యం కొనుగోలు కేంద్రానికి లారీలు రావడం లేదని, సుమారు ఆరువేల ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్నాయని కొంతమంది రైతులు ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డికి మొరపెట్టుకున్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా వెంటనే లారీలు పంపి, ధాన్యం తరలించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రానికి లారీలు పంపించి, ధాన్యం తరలించాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలులో అక్రమాలు అరికట్టాలి



పెగడపల్లిలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెగడపల్లి: ధాన్యం కొనుగోలులో మిల్లర్లు పాల్పడుతున్న అక్రమాలను అరికట్టాలని మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. పెగడపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నిల్వలు అలాగే ఉన్నాయని, రైతులు అవస్థలు పడుతున్న అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. రైతులు కొనుగోలు విషయంలో ఇబ్బందులు పడకుండా చూడాలని, కొనుగోళ్ల వేగం చేయాలని కోరుతూ తహసీల్దార్ కృష్ణచైతన్యకు వినతిపత్రం అందజేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, సర్పంచులు మహేందర్‌రెడ్డి, శంకర్, నాయకులు తిరుపతి, మల్లారెడ్డి, రాజు, విజయభాస్కర్, సతీశ్‌రెడ్డి, విష్ణు, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి



పెగడపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ శోభ

రాయికల్: దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. జూన్ 2 నుంచి 22 వరకు జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవాల్లో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సంతోష్‌కుమార్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గ్రామాల్లో ఏర్పాట్లు చేయాలని జగిత్యాల రూరల్ ఎంపీడీవో రాజేశ్వరి అన్నారు. మంగళవారం జగిత్యాల మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై శంకరయ్య, డెప్యూటీ ఇరిగేషన్ ఈఈ రాజన్న, మెడికల్ ఆఫీసర్ శివకుమారి, ఎంపీవో రవిబాబు, సూపరింటెండెంట్ గంగాధర్, ఎంఈవో గాయత్రి, ఏపీఎం గంగాధర్ పాల్గొన్నారు.

పెగడపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయాలని ఎంపీపీ శోభ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు ఉత్సవాలు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగాధర్, తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీవో మహేందర్, విండో చైర్మన్ వేణుగోపాల్, ఆర్బీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గొల్లపల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీవో నవీన్‌కుమార్ తెలిపారు. మంగళవారం గొల్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నక్క శంకరయ్య అధ్యక్షతన సర్పంచులు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధు, ఎస్సై దత్తాత్రి, ఎంపీవో సురేశ్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బుగ్గారం: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల విజయవంతానికి కృషి చేయాలని ఎంపీపీ, జెడ్పీటీసీ బాదినేని రాజమణి, రాజేందర్ అన్నారు. మంగళవారం దశాబ్ది ఉత్సవాలపై సమావేశం నిర్వహించారు.

కొండగట్టు: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై మంగళవారం ఎంపీపీ మేనేని స్వర్ణలత సమీక్ష నిర్వహించారు. సర్పంచులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

కోరుట్ల రూరల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిదులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణ, ఎంపీడీవో నీరజ, తహసీల్దార్ నీరటి రాజేశ్, సర్పంచులు, అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మినీ వాటర్‌ట్యాంక్ అందుబాటులోకి తీసుకురావాలి

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మహాలక్ష్మీవాడలో మినీ వాటర్‌ట్యాంక్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ జనసమితి పార్టీ నాయకులు చింతకుంట శంకర్, కంతి రమేశ్, గుండెటి శేఖర్ సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్ బాబుకు ఫిర్యాదు చేశారు. ఎండకాలం ఎండలు తీవ్రంగా ఉన్నందున వాటర్‌ట్యాంక్‌లో నీళ్లు నింపకపోవడంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై సర్పంచ్, పంచా యతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోవడం లే దని తెలిపారు. వెంటనే మినీవాటర్ ట్యాంక్‌ను అందుబాటులోకి తీసుకరావాలని డిమాండ్ చేశారు.